RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 361 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 3 జూలై 2024 పేజీలు : 4 వెల : 2/-



# కేంద్ర బడ్జెట్‌కు రంగం సిద్ధం

## ఈసారి పలు కీలక ప్రతిపాదనలు!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23 లేదా 24న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈమేరకు కసరత్తు చేస్తున్నారు. అయితే అధికారికంగా తేదీలు ప్రకటించలేదు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలు జూలై 4న ముగుస్తాయి. ఈ సమావేశాల్లో ఎంపీల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక జరిగాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి ఆమోదం తెలుపనున్నారు. తర్వాత సమావేశాలు ముగుస్తాయి.

**జూలై 22 నుంచి వర్షాకాల సమావేశాలు..** వర్షాకాల పార్లమెంటు సమావేశాలు జూలై 22 నుంచి నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. ఆగస్టు 9వ తేదీ వరకు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లోనే కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుంది. జూలై 23 లేదా 24 తేదీల్లో బడ్జెట్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారని తెలుస్తోంది.

**జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక సిఫారసులు..** కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో జూన్ 22న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో వస్తు సేవలకు జీఎస్టీ వర్తింపును క్రమబద్ధీకరించడానికి ప్రతిపాదనలపై చర్చించారు. జీఎస్టీ పన్ను రేట్లు, సేవా మినహాయింపులను మెరుగుపరచడానికి అనేక సిఫార్సులు కౌన్సిల్ సూచించింది. రాష్ట్రాల వాటాను ఎప్పటికప్పుడు అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశాయి. నిర్మలా సీతారామన్ కూడా ఇందుకు సానుకూలంగా స్పందినట్లు తెలుస్తోంది.

**భిన్నంగా బడ్జెట్ కేటాయింపులు..** ఇదిలా ఉంటే ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు గతంలోకన్నా భిన్నంగా ఉండే అవకాశం ఉందని జెఫరీస్ ఇప్పటికే అంచనా వేస్తోంది.

ఆర్‌బీఐ రూ.2.11 లక్షల డివిడెండ్ చెల్లిస్తుండటంతో కేంద్రానికి ఆర్థిక లభ్యత పెరుగుతుందని తెలిపింది. దీంతో ఆర్థిక వృద్ధి లక్ష్యాలనూ కొనసాగిస్తూనే సామాజిక వ్యయం కూడా పెరిగేలా బడ్జెట్ కేటాయింపులు ఉండవచ్చని జెఫరీస్ నివేదిక తెలిపింది.




# తెలంగాణలో జెట్ స్పీడ్‌లో మారుతున్న రాజకీయాలు..

తెలంగాణలో రాజకీయాలు జెట్ స్పీడ్ గా మారిపోతున్నాయి. ఇప్పటికే.. బీఆర్ఎస్ ను వరుస కష్టాలు కుదేలు చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇప్పటికే.. ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. తాజాగా, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పోచారం శ్రీనివాస్ రెడ్డిలు పార్టీ మారడం పట్ల గులాబీబాస్ , పార్టీ శ్రేణులు షాక్ కు గురయ్యారంట. కాంగ్రెస్ నేతలు కూడా గులాబీ పార్టీ నుంచి నేతలు కాంగ్రెస్ లోకి చేరడాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు.. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దీనిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఈ చేరికలపై బహిరంగంగానే విమర్శలు చేశారు. ఒకానోక సందర్భంలో.. ఆయన ఏకంగా ఎమ్మెల్సీకి రాజీనామా సైతం చేస్తానంటూ కూడా వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. దీనిపై ప్రస్తుతం ఇంకా బుజ్జగింపులు నడుస్తున్నాయి. మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ లో కొన్నిరోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అనేక మంది సీనియర్ నేతలంతా హస్తినలోనే మకాం వేశారు. అంతేకాకుండా.. కెబినెట్ విస్తరణ కూడా ఉంటుందని కూడా వార్తలపై జోరుగా ప్రచారం నడుస్తోంది. పోచారంకు మంత్రి పదవి ఇస్తారని ప్రచారం నడుస్తోంది. మరోవైపు తెలంగాణకు కొత్త పీసీసీ ప్రెసిడెంట్ ఎన్నికపైన కూడా కొంత మంది నేతల పేర్లు ప్రచారంలో ఉంటున్నాయి. ఇదిలా ఉండగా.. తాజాగా, మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ మారుతున్నరన్న ప్రచారం జోరుగా సాగుతుంది. ఇప్పటికే ఢిల్లీ లెవల్ కూడా మంత్రాగం నడుస్తున్నట్లు సమాచారం. అదే విధంగా.. గతంలో రేవంత్, తలసాని టీడీపీలో ఉండగా పనిచేశారు. కానీ ఇటీవల మాత్రం పక్కా.. వ్యతిరేకమైన పార్టీలలో ఉండటం వల్ల పలు మార్లు విమర్శలు సైతం గుప్పించుకున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి తలసాని పార్టీ మారుతారి, కాంగ్రెస్ లోకి చేరతారని ప్రచారం జరుగుతుంది. దీనిపై ఏకంగా యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ సైతం రంగంలోకి దిగి, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ తో రాయబారం చేస్తున్నారంట. తెలంగాణ కేబినెట్ విస్తరణలో భాగంగా.. తలసానికి మంత్రి బెర్త్ కూడా కన్ఫామ్ అయిపోయిందని పుకార్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు కాలం చేసిన విషయం తెలిసిందే.

ఈ పుకార్లపై మాత్రం.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇప్పటి వరకు స్పందించలేదు. ప్రస్తుతం ఈ ఘటన మాత్రం తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.




# 4న స్కూళ్లు, కాలేజీల బంద్

హైదరాబాద్ : నీట్, నెట్ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ SIF, AISF, PDSU, PDSO, NSUI విద్యార్థి సంఘాలు జులై 4న దేశ వ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీల బంద్కు పిలుపునిచ్చాయి. NTAను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

గత ఐదేళ్లలో 65 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయని, దీనిపై పార్లమెంట్లో మోదీ చర్చించి న్యాయం చేయాలని కోరాయి. లీకేజీలతో విద్యార్థులు నష్టపోయారని తెలిపాయి.

# తెలంగాణలో "కారు" కదలాలంటే "కమలం"తో కలవాల్సిందేనా..?




హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ ఆ తర్వాత కుదుపులకు గురవుతోంది. అయితే తాజా రాజకీయ పరిస్థితుల్లో గులాబీ పార్టీ కమలం పార్టీతో జతకట్టబోతోందనే వార్త ప్రచారంలో ఉంది. బీజేపీ బీఆర్ఎస్ దోస్తీపై 2018 నుంచే వార్తలు షికారు చేస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు అలాంటిదేమీ కనిపించలేదు. ఇక తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులు గమనిస్తే.. మాజీ సీఎం కేసీఆర్ కూతురు మద్యం కుంభకోణంలో అరెస్టు కావడం, మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ దక్కించుకోకపోవడం, కొందరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం వంటి అంశాలు బీఆర్ఎస్ క్యాడర్‌లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇక వ్యూహాత్మకంగా అడుగులు వేసే సమయం వచ్చిందని గులాబీ పార్టీ భావిస్తోంది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడ్డాక ఎస్సీ ఎస్టీ మైనార్టీలు, ఓబీసీ సామాజిక వర్గాలు బీఆర్ఎస్ వెంటే నడిచారు. కానీ మారిన పరిస్థితుల్లో వీరంతా కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారు. ఇక బీజేపీ విషయానికొస్తే మొత్తం 17 పార్లమెంటు స్థానాలున్న తెలంగాణలో 8 సీట్లను కైవసం చేసుకుంది. అయితే 2020లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కించుకుంది. అదే ఊపును కొనసాగించి ఉంటే మరిన్ని సీట్లను పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ గ్యాప్‌ను కాంగ్రెస్ పార్టీ భర్తీ చేసింది. క్యాడర్ సమన్వయ లోపం, 119 అసెంబ్లీ స్థానాల్లో సరైన అభ్యర్థులు లేకపోవడం, బలమైన లక్ష్యం లేకపోవడం వంటి అంశాలు బీజేపీని ఎదగకుండా చేశాయనేది స్పష్టమవుతోంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో క్రమంగా ప్రాభవం కోల్పోతున్న బీజేపీకి మొన్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 8 సీట్లు రావడం ఆ పార్టీకి ఒక్కింత బలం చేకూరినట్లయింది. దీంతో తెలంగాణలో బలపడేందుకు అన్ని రకాల వ్యూహాలను కమలం పెద్దలు అమలు చేసే పనిలో పడ్డారు.

**ఆపరేషన్ లోటస్ :** తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో ఎక్కడైతే పార్టీ బలహీనంగా ఉందో అక్కడ పాగా వేసే ప్రయత్నాలు బీజేపీ చేస్తోంది. అక్కడ అప్పటికే కాస్తో కూస్తో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలతో జతకట్టే ప్లాన్ చేస్తోంది. ముందుగా జతకట్టడం ఆ తర్వాత తన మార్క్‌ను క్రియేట్ చేసుకున్న తర్వాత ఆ ప్రాంతీయ పార్టీని తనలో కలిపేసుకుపోవడం వంటి వ్యూహాలతో కమలం పార్టీ ముందుకెళుతోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌తో జతకట్టి తెలంగాణలో బలపడాలన్న ఆలోచనతో కాషాయం పార్టీ ఉన్నట్లు సమాచారం. తెలంగాణలో బీర్ఎస్ బీజేపీల మొత్తం ఓటు షేరు 51.25శాతంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం బీఆర్ఎస్ వద్ద ఉన్న ఓటు బ్యాంకు బీజేపీకి బదిలీ అవుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో వీరి ఓటు షేరు 40శాతం అని చెప్పొచ్చు.

**మైనార్టీ కార్డు :** తెలంగాణలో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు దాదాపు 13శాతంగా ఉన్నారు. మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో నువ్వ నేనా అన్నట్లుగా సాగే పోరులో 45 స్థానాల్లో ముస్లిం ఓటర్లు ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదే అంశం బీఆర్ఎస్‌కు కలిసొచ్చింది. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీగా గుర్తింపు ఉండటంతో పాటు మజ్లిస్‌తో కూడా స్నేహపూర్వకమైన సంబంధాలు కలిగి ఉండటంతో 2014,2018లో గులాబీ పార్టీకి కలిసొచ్చింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్‌కు 37.35శాతం ఓట్లు రాగా అందులో ముస్లిం ఓటర్లు భాగస్వామ్యం మెండుగా ఉందనే చెప్పాలి. ఒక వేళ బీజేపీతో రహస్య సంబంధం పెట్టుకోవాలని బీఆర్ఎస్ భావించినా.. లేదా ప్రత్యక్షంగా స్నేహం చేయాలని తలచినా ముస్లిం ఓటర్లు దూరం కావడం తథ్యమనే వాదన వినిపిస్తోంది. అటు మజ్లిస్‌తో మంచి సంబంధాలు నెరుపుతున్నప్పటికీ బీజేపీతో సంబంధం పెట్టుకుంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గడ్డుపరిస్థితులే ఎదురవుతాయనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ కేసీఆర్ బీజేపీతో పొత్తుతో వెళ్లేందుకు ఇష్టపడలేదు. తాత్కాలిక ఊరట కోసం రిస్క్ చేస్తే మొదటికే మోసం వస్తుందన్న అభిప్రాయం బీఆర్ఎస్ సీనియర్ నేతల్లో వ్యక్తమవుతోంది.

**బీఆర్ఎస్‌కు వారసులు ఎవరు.? :** 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తొలిసారిగా ముఖ్యమంత్రి అయ్యారు కేసీఆర్. అదే ఊపును కొనసాగించి 2018లో మరోసారి అధికారం దక్కించుకున్నారు. అయితే రెండవ సారి సీఎంగా అయిన కేసీఆర్...చివరి రెండున్నరేళ్లలో తన కుమారుడు అప్పటి ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను సీఎంగా ప్రమోట్ చేస్తారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. ఇక 2019లో కేటీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేసీఆర్ ప్రకటించడంతో హరీష్‌రావు అలిగారనే వార్తలు గుప్పుమన్నాయి. కేసీఆర్ కుటుంబం అంతా కలిసే ఉన్నట్లు సంకేతాలు వచ్చినప్పటికీ వారి మధ్య తెలియని అసంతృప్తి ఉండేదని హరీష్ రావు సన్నిహితులు చెప్పుకొచ్చేవారు. హరీష్ రావు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారనే వార్తలు కూడా ఈ మధ్యకాలంలో వినిపించాయి. కేసీఆర్‌తో రాజకీయంగా సుదీర్ఘ ప్రయాణం చేసి పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరుగాంచిన హరీష్ రావుకు మాస్‌లీడర్ ఇమేజ్ కూడా ఉంది. మరో వైపు కేటీఆర్ ప్రోగ్రెసివ్ లీడర్‌గా గుర్తింపు ఉంది. విజన్ కలిగిన నాయకుడిగా ప్రజల్లో మంచి పేరును సంపాదించారు. దీంతో ఒక వేళ కేసీఆర్ రాజకీయాలకు గుడ్‌బై చెప్పాల్సి వస్తే కేటీఆర్ హరీష్ రావుల్లో ఎవరు పార్టీ పగ్గాలను చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గమనిస్తే బీఆర్ఎస్ ఘోరంగా వైఫల్యం చెందింది. ఇందుకు కారణం వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టిన మాజీ మంత్రి కేటీఆర్ అనుకున్నంత స్థాయిలో రాణించలేకపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేటీఆర్‌ను కేవలం పట్టణ ప్రాంత ప్రజలు, చదువుకున్న వారు మాత్రమే సొంత చేసుకున్నారు. అందుకే హైదరాబాద్ నగరంలోనే బీఆర్ఎస్‌కు మెజార్టీ స్థానాలు వచ్చాయి. ఇక కేసీఆర్ కుమార్తె కవిత అరెస్టుతో ఆ పార్టీని నడిపే పెద్ద దిక్కు ఇంకా ఎవరైనా ఉన్నారా అంటే అన్ని వేళు హరీష్ రావు వైపే చూపిస్తున్నాయి.

**బీజేపీని నడిపించేదెవరు.? :** తెలంగాణలో బీజేపీ క్రమంగా బలపడుతున్నప్పటికీ.. ఆ పార్టీకి సీఎం అభ్యర్థి ఎవరనేదానిపై క్లారిటీ లేదు. కాంగ్రెస్ విషయానికొస్తే కేసీఆర్ పై అంశాల వారీగా విరుచుకుపడుతూ ఒక ఫైర్ బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి. రేవంత్ ప్రజల్లోకి దూసుకెళుతూ కేసీఆర్‌కు నిద్రపట్టకుండా చేయడంలో సక్సెస్ అయ్యారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో హైకమాండ్ రేవంత్ వైపే మొగ్గు చూపి అతన్నే సీఎంగా ప్రకటించింది. 2020లో బీజేపీలో కనిపించిన జోష్ 2023 వరకు కొనసాగించడంలో విఫలమైంది. గత దశాబ్దకాలంగా మంచి సీఎం అభ్యర్థి కోసం బీజేపీ వేటాడుతోంది. కానీ ప్రయత్నాలు ఫలించడం లేదు. హరీష్‌రావుతో బీజేపీ జతకడితే ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా పరిస్థితులు మారుతాయి. అంతేకాదు మాస్ లీడర్ ఇమేజ్ ఉన్న హరీష్ రావు నాయకత్వంలో బీజేపీ దూసుకెళుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అన్న విధానాన్ని తొలగించి ముందుకు వెళితే తెలంగాణలో బీజేపీకి చక్కటి అవకాశం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

**బీఆర్ఎస్ పడిపోయింది..కానీ..:** ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. అయితే ఈ పరిస్థితి ఎల్లకాలం ఉండదనేది గ్రహించాలి. ఇప్పుడప్పుడే తేరుకునే పరిస్థితి లేదని చెప్పడానికి వీలులేదు. రాష్ట్ర అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీనే రెండవ అతిపెద్ద పార్టీగా ఉందన్న విషయాన్ని మరువకూడదు. ఇందుకు తాజా ఉదాహరణ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు కష్టమనే అంతా భావించారు. కానీ చంద్రబాబు అనూహ్యంగా 135 స్థానాలను గెలుచుకున్నారు. మొత్తంగా కూటమికి 164 స్థానాలు వచ్చాయి. అంటే రాజకీయాల్లో ఏమైనా జరగొచ్చునేదానికి ఇది చక్కటి ఉదాహరణ. బండ్లు ఓడలు కావొచ్చు.. ఓడలు బండ్లు కావొచ్చు. బీఆర్ఎస్ ఒక కుటుంబంగా నిలబడి, అధికార కాంగ్రెస్ పార్టీ చేసే తప్పిదాల కోసం వేచిచూసి సరైన సమయంలో సరిగ్గా పంజా విసిరితే తిరిగి అధికారాన్ని పొందొచ్చునేది పొలిటికల్ అనలిస్టుల మాట. ఇక మొత్తంగా చూస్తే తెలంగాణ రాజకీయాలు భవిష్యత్తులో చాలా ఆసక్తికరంగా మారనున్నాయి. ఈ ప్రయాణంలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు ఎలా ఉండబోతోందనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా మారనుంది. మరోవైపు బీజేపీ బలపడి రాష్ట్రంలో పాగా వేసే స్థాయికి ఎదుగుతుందా.. లేక కాంగ్రెస్ కట్టడి చేస్తుందా అనేది కూడా కాలమే నిర్ణయిస్తుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## రాహుల్ రాజకీయ ప్రకంపనలు!

రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదాలో చేసిన తొలి ప్రసంగం రాజకీయ ప్రకంపనలు పుట్టించింది అని చెప్పాలి. విపక్ష సభ్యులు అంతా హుషారు చేస్తూ బల్లలు చరుస్తూ రాహుల్ ప్రసంగం ఆద్యంతం ఆందించారు. అదే టైంలో అధికార ఎన్డీయే కూటమి నుంచి నిరసనలు వినిపించాయి. అయితే అనేకసార్లు మధ్యలో స్పీకర్ జోక్యం చేసుకుంటూ రాహుల్ దూకుడు ప్రసంగం మీద అభ్యంతరం చెప్పారు. అయినా సరే రాహుల్ గాంధీ తాను ఏదీ ఆరోపించడం లేదని ప్రధాని మోడీ స్వయంగా అన్న మాటలనే సభకు చెబుతున్నాను అని ప్రసంగం కొనసాగించారు. ఇంతకీ రాహుల్ అన్నదేంటి అంటే దేవుడి తోనే తనకు కనెక్షన్ ఉందని మోడీ ఎన్నికల సభలలో అన్న మాటలను గుర్తు చేశారు. ఆ పాయింట్ తోనే రాహుల్ గాంధీ మోడీని ఇరికించేశారు. అధికార పక్షాన్ని తన మాటలతో చెడుగుడు ఆడుకున్నారు. దేవుడు చెబితేనే దేశంలో మోడీ విధ్వంసకర పాలన చేస్తున్నారా అని కూడా విమర్శించారు. మణిపూర్ దేశంలో భాగం కాదా మణిపూర్ మండిపోతూంటే ఎందుకు ప్రధాని మోడీ మాట్లాడలేదు, కనీసం అక్కడికి ఎందుకు వెళ్ళలేదు అని నిలదీశారు. దేశంలో భిన్న వర్గాల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ పాలనా అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మార్క్ హిందూత్వను ఎద్దేవా చేశారు. ఫైజాబాద్ లో బీజేపీ ఓటమిని గుర్తు చేస్తూ అయోధ్య రాముడి ఆశీస్సులు ఎందుకు లేవు అని కూడా నిగ్గదీశారు. గడచిన పదేళ్ళుగా దేశంలో సాగిన మోడీ మొత్తం పాలనను విమర్శిస్తూ రాహుల్ ప్రసంగం సాగింది. పెద్ద నోట్ల రద్దును కూడా ఆయన ప్రస్తావించారు. ఇదిలా ఉంటే సభలో శివుడు ఫోటోతో రాహుల్ మాట్లాడడం మీద బీజేపీ నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరం వ్యక్తం అయింది. అయితే తాను ఏమీ అభ్యంతరమైన ఫోటోలు ప్రదర్శించలెదని రాహుల్ సమర్ధించు కున్నారు. కానీ దీని మీద ప్రధాని మోడీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే రాహుల్ గాంధీ రాజ్యాంగం ఫోటోను కూడా సభలో చూపించడం పట్ల బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను శివుడు ఫోటో రాజ్యాంగం ఫోటోను సభలో చూపిస్తే తప్పా అని రాహుల్ ప్రశ్నించారు. అంతే కాదు శివుడి నుంచి తాను ప్రేరణ పొందాను అని రాహుల్ చెప్పారు. రాజ్యాంగానికి రక్షణగా ఉంటాను అని ఆయన అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నందుకు ఆనందిస్తున్నాను అని ఆయన అంటూ అధికారం కంటే నిజం గొప్పదని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ సీబీఐలతో ఇండియా కూటమి నేతలను వేధిస్తోందని ఆయన ఆరోపించరు. ఏకంగా రాజ్యాంగం మీదనే దాడి జరుగుతోందని ఆయన అన్నారు. నేరుగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల తోనే ఇండియా కూటమి నేతలను టార్గెట్ చేస్తున్నారు అని రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. తన ఎంపీ పదవితో పాటు తన నివాసాన్ని కూడా లాక్కున్నారని తనను ఈడీ ముందు విచారణకు పిలిచి ఏకంగా 55 గంటల పాటు విచారించారని ఆయన గుర్తు చేశారు. తాను ప్రతిపక్ష నేతగా ఈ రోజు ఉండడాన్ని గర్విస్తున్నాను అని రాహుల్ చేసిన ఈ ప్రసంగం మాత్రం ఇండియా కూటమిని ఆందంలో ముంచెత్తగా బీజేపీ నేతలను తీవ్ర అసహనానికి గురి చేసింది. మొత్తానికి దేవుడికీ తనకు కనెక్షన్ అని మోడీ అన్నట్లుగా వచ్చిన వార్తలను ఆధారం చేసుకుని సభలో రాహుల్ సెటైర్లు వేస్తూ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది అనే చెప్పాలి.

# సర్కారు జాగా దర్జాగా కబ్జా.. ఇంటి నంబర్లతో వెయ్యి గజాలకు దరఖాస్తు



హైదరాబాద్ : గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లో కొందరు అక్రమార్కులు తప్పుడు పత్రాలతో మాయాజాలం ప్రదర్శించి వెయ్యిగజాల సర్కారు స్థలాన్ని కబ్జా చేశారు. ఖాజాగూడలోని దిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా నివాసముంటున్న వీరు.. వెయ్యి గజాల స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ఏళ్ల తరబడి ఆ స్థలంలో ఉంటున్నామంటూ తాము ంటున్న ఇంటినంబర్లతోనే జీవో నంబర్ 59తో క్రమబద్ధీకరించుకున్నారు. అనంతరం భవన నిర్మాణానికి జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకుని భవనాలు నిర్మిస్తున్నారు. ఇదంతా కేవలం ఆరేళ్ల వ్యవధిలోనే పూర్తిచేశారు. తాముంటున్న ఇళ్లపై బ్యాంకులో రుణాలు కూడా తీసుకున్నారు. క్రమబద్ధీకరించేటప్పుడు శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు పరిశీలించకపోవడం, జీహెచ్‌ఎంసీ అధికారులు వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా అనుమతులిచ్చేశారు.

జీహెచ్‌ఎంసీ అధికారులూ ఇలా చేశారు..

ఖాజాగూడలో రహదారి విస్తరణకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఐదేళ్ల క్రితం స్థల సేకరణ చేపట్టారు. 1242 గజాల స్థలంలో 204 గజాలను తీసుకున్నారు. నష్టపరిహారంగా టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్)ను అందజేశారు.

తప్పుడు పత్రాలతో కబ్జాచేసుకున్న 1002 గజాల స్థలం ఉండగా... రెండేళ్ల క్రితం ప్రభుత్వ స్థలంలో మరో 234గజాల స్థలాన్ని కబ్జా చేసి మొత్తం 1236.5గజాల స్థలాన్ని ఓ స్థిరాస్తి సంస్థతో అభివృద్ధికి ఒప్పందం కుదుర్చుకున్నారు.

గతేడాది ఏప్రిల్‌లో ఆ స్థలంలో రెండు సెల్లార్‌లు, ఒకగ్రౌండ్ ఫ్లోర్ సహా నాలుగు అంతస్థుల భవనం నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జీహెచ్‌ఎంసీ అధికారులు పదిశాతం స్థలాన్ని మార్టిగేజ్ చేసుకుని నిర్మాణానికి అనుమతులిచ్చారు.

అలా కన్నేశారు... ఇలా ఆక్రమించుకున్నారు..

ఖాజాగూడ సర్వే నం.28లో దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం 1982లో కోళ్లఫారాలు ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కొక్కరికీ 242 గజాల చొప్పున స్థలాలను కేటాయించింది. వీటిని విక్రయించకూడదు.. బదిలీ చేయకూడదన్న నిబంధనలతో ప్రభుత్వం కేటాయించగా... కొన్నేళ్ళయ్యాక చాలామంది లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. ఇందులో రెండు ఇళ్ల యజమానుల వారసులు నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు విక్రయించి సేల్‌డీడ్ చేశారు. వాటిని 2010లో పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. లబ్ధిదారుల నుంచి ఇళ్లను కొనుగోలు చేసిన వ్యక్తులు 2015లో పుప్పాలగూడలోని ఓ బ్యాంకులో తనఖా ఉంచి రూ.1.08కోట్ల రుణాన్ని తీసుకున్నారు.

రికార్డులు పరిశీలిస్తాం: కె.వెంకట్‌రెడ్డి, ఆర్డీవో రాజేంద్రనగర్

ఖాళీ స్థలాన్ని వేరే నిర్మాణానికి జతచేస్తే నిబంధల ప్రకారం జీవో నంబర్ 59తో క్రమబద్ధీకరించకూడదు. ఆరేళ్ల క్రితం క్రమబద్ధీకరించారంటే రికార్డులు పరిశీలిస్తాం. అక్రమాలు జరిగాయని తేలితే.. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

# గుప్పిట గులాబీ





హైదరాబాద్ : రాజధానిలో కాంగ్రెస్ బలం పెంచుకోవడానికి వేసిన వ్యూహంలో భారాస ఎమ్మెల్యేలు చిక్కుకుంటున్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మొదలైన మార్పు కొనసాగింపేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆకర్ష్ ఫలితమిస్తోంది. హైదరాబాద్ సమీప జిల్లాల్లో భారాసకు చెందిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఆ పార్టీ పెద్దఎత్తున దృష్టి సారించింది. కొంతమంది ఎమ్మెల్యేలు తక్షణం పార్టీలోకి చేరడానికి సిద్ధమవుతుండగా.. మరికొద్ది మంది కొంత కాలం వేచి చూసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్నారు. చేవెళ్ల సీనియర్ భారాస ఎమ్మెల్యే యాదయ్య దిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరారు. వచ్చే నెల రోజుల్లో మరో అయిదుగురుని పార్టీలో చేర్చుకోవడంపై కాంగ్రెస్ అగ్రనేతలు సమాలోచనలు జరుపుతున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అతి తక్కువ స్థానాలను సాధించింది. ఈ జిల్లాల్లో 29 స్థానాలుంటే కాంగ్రెస్ మూడు స్థానాలకే పరిమితమైంది. భారాస 18 స్థానాల్లో, ఎంఐఎం ఏడు, భాజపా ఒక్క స్థానంలో గెలుపొందాయి.

పట్టు పెంచుకోవడానికి..: హైదరాబాద్ నగర పరిధిలో పట్టు పెంచుకోవడానికే భారాస ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకోవాలని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో భారాస ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కావడం లేదు. అధికారులు మాట వినడం లేదు. అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం ఉండటం లేదని భావిస్తున్న వారిని మెల్లగా దారిలోకి తెచ్చుకోవడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వాళ్లకు నియోజకవర్గంలో మళ్లీ పెత్తనం కొనసాగించుకోవడానికి అధికారం కావాలనే చాలా మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వచ్చారు. పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. చివరి నిమిషంలో ఆయన వెనకడుగు వేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జానారెడ్డిని కలిసి వచ్చారు. ఆయనకాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశం ఉందని అంటున్నా... దీన్ని ఆయన ఖండిస్తున్నారు. ఎమ్మెల్యేలతో మంతనాలు జరుగుతున్నాయని... ఒకరిద్దరు తప్ప నగరానికి చెందిన భారాస ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌లో చేరతారని దానం పేర్కొంటున్నారు.

# వనరుల పరిరక్షణకు కార్యాచరణ



పెద్దపల్లి : చెరువులు, నీటి కుంటలు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురవుతున్నాయి. మురుగు, రసాయనాలతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. గతంలో నీటి వనరుగా ఉపయోగపడిన చెరువులు ప్రస్తుతం చాలా చోట్ల మురుగు నిల్వకు కేంద్రంగా మారాయి. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను కాపాడుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు పురపాలక శాఖకు బాధ్యత అప్పగించింది. తటాకాల పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థలు, వివిధ రంగాల నిపుణులు, రాష్ట్రంలోని కమిషనర్లతో పురపాలక శాఖ సమీక్షలు నిర్వహించింది. పురపాలక, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు చెందిన ఇంజినీర్లు, అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఆక్రమణలో 30 శాతం వనరులు

కేంద్ర జలశక్తి శాఖ గతేడాది నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 శాతం చెరువులు, 40 శాతం కుంటలు ఆక్రమణలకు గురైనట్లు తేలింది. కరీంనగర్, రామగుండం, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం కబ్జాలు జరిగినట్లు వెల్లడించింది. ఓవైపు ఆక్రమణలతో చెరువులు కుచించుకుపోగా మరోవైపు మురుగును నేరుగా తటాకాల్లోకే మళ్లిస్తున్నారని నివేదికల్లో తేలింది. సర్వేలో ఇలాంటి చెరువులను గుర్తించి అవసరమైన చోట్ల మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీలు) నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పురపాలక అధికారులకు ఆదేశాలు అందాయి.

నెలాఖరులోగా పూర్తికి ఆదేశాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 4,283 చెరువులున్నాయి. అంతటా కలిసి 2 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టున్నా 1.27 లక్షల ఎకరాలకు, అది కూడా ఒక పంటకు మాత్రమే నీరందేది.

గత ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద మొత్తం రూ.741.18 కోట్లతో 1,833 చెరువులను పునరుద్ధరించగా నీటి నిల్వ సామర్థ్యం 19.93 టీఎంసీలకు పెరిగింది.

అయితే కొన్ని చెరువులు కళ తప్పాయి. మరికొన్ని చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. పశువులు, కోళ్ల వ్యర్థాలు, మురుగుతో కాలుష్య కాసారాలుగా మారాయి.

ఈ నేపథ్యంలో నాలుగు జిల్లాల పరిధిలో ముందు నగర, పట్టణ ప్రాంతాల్లోని చెరువులను ఎంపిక చేసి ఐఐటీ, స్వచ్ఛంద సంస్థల నిపుణుల సమష్టి భాగస్వామ్యంతో సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని పురపాలిక కమిషనర్లకు బాధ్యత అప్పగించారు.

ప్రతి పట్టణంలో ఎన్ని చెరువులున్నాయి? వాటి గరిష్ఠ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) ఎంత? బఫర్ జోన్ ఎంత? ఆక్రమణలున్నాయా? ప్రస్తుత పరిస్థితులు ఏమిటి? చెరువుల్లోకి వ్యర్థ జలాలు, కాలుష్య కారకాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? తటాకాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? తదితర విషయాలపై సర్వే చేయాలని పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఈ విషయమై పెద్దపల్లి పురపాలక కమిషనర్ ఆకుల వెంకటేశ్‌తో మాట్లాడగా ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకొని కార్యాచరణ చేపట్టామన్నారు.

# కొండెక్కిన కూరగాయలు

ఖమ్మం : కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. ఖమ్మంలోని హోల్‌సేల్ వ్యవసాయ మార్కెట్ నుంచి ఖమ్మం నగరం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ములుగు, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాపారులు కూరగాయలు కొంటారు. ప్రస్తుతం ఖమ్మం రైతుబజార్లలోనే ఎక్కువ ధరలు పలుకుతుంటే మిగతా ప్రాంతాల్లో చిరువ్యాపారుల దగ్గర మరింత మండిపోతున్నాయి.

వేసవి ప్రభావం వేసవి కారణంగా దిగుబడులు తగ్గిపోవటం ధరలపై కొంత ప్రభావం పడింది. ఖమ్మం టోకు విపణికి సీజన్‌లో రోజుకు 800-900 క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం రోజుకు 400- 500 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. వీటిలో కొన్నింటిని ఏపీ, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి టోకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు.

దుంప కూరలూ ఎక్కువే..

కిలో ఆలుగడ్డ రూ.40, చామగడ్డ రూ.46, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.36 చొప్పున ధరలు పలుకుతున్నాయి.

ఇవి.. కొద్దిగా పర్వాలేదు..

కిలో బెండ రూ.30, దొండ రూ.24, సొరకాయ రూ.30, వంకాయ రూ.18, దోస రూ.30, క్యాబేజి రూ.26.

చిక్కదు గోరుచిక్కుడు..

15 రోజుల క్రితం గోరుచిక్కుడు కిలో ధరలు రూ.26 నుంచి రూ.30 ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ.58కి పెరగటంతో వినియోగదారులు కొనలేకపోతున్నారు.

ఠారెత్తిస్తున్న భగ్గుమంటున్న పచ్చిమిరప

నెల రోజులుగా పచ్చిమిరప ధరలు భగ్గుమంటున్నాయి. రెండు రోజుల క్రితం కిలో రూ.58 ఉంటే.. ఇప్పుడు మళ్లీ కిలో ధర రూ.70 పలుకుతోంది. అయినా విపణిలో సరకు దొరకటం లేదు. చాలా తక్కువ నిల్వలు ఉంటున్నాయి.

టమాట..

కొద్దినెలల పాటు టమాట ధరలు కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య స్థిరంగా ఉండేవి. ఇప్పుడు రైతుబజార్లలోనే కిలో రూ.64 వరకు పలుకుతోంది. బహిరంగ విపణిలో చిరు వ్యాపారులు రూ.75కు విక్రయిస్తున్నారు.

కాకరా.. మజాకా..

వారం క్రితం కిలో రూ.30 నుంచి రూ.35 వరకు ఉన్న కాకరకాయల ధర ఇప్పుడు అమాంతం పెరిగింది. ప్రస్తుతం పొట్టి రకం కిలో ధర రూ.66, పొడవు రకం రూ.70 వరకు పలుకుతోంది.

కొనలేం.. క్యాప్సికం

క్యాప్సికం కిలో ధర రూ.74 వరకు ఉంది. వినియోగదారులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల వరకు కిలో రూ.35 నుంచి రూ.45 వరకు ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

వామ్మో బీర

బీరకాయల ధర కిలో రూ.80 వరకు ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వీటి ధరలు ఇంతగా ఎన్నడూ పెరగలేదని వాపోతున్నారు. పక్షం రోజుల వరకు కిలో రూ.30లోపు ఉన్న ధరలు విపరీతంగా పెరిగాయి. సరకు సైతం తక్కువగా ఉంది.

ఆకుకూరలూ పిరం..

కొద్దిరోజుల వరకు రూ.10కి 2 కట్టల చొప్పున ఆకుకూరలు విక్రయించారు. ప్రస్తుతం రూ.20కి 2 లేదా 3 కట్టలు మాత్రమే ఇస్తున్నారు. కొత్తిమీర కట్ట ధర రూ.70కి చేరింది. గతంలో రోజుకు 60-70 కట్టలు విక్రయించిన వ్యాపారులు ఇప్పుడు 10- 20 మాత్రమే తెస్తున్నారు. ధర ఎక్కువగా ఉండటంతో పాడైపోతాయనే భయంతో తక్కువ మొత్తంలోనే తెచ్చి అమ్ముతున్నారు.

## సీతా రామా ..ఇక వడివడిగా ..!

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ఏడేళ్ల క్రితం సీతారామ ప్రాజెక్టుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2017లో తొలి అడుగు పడినా.. ఇప్పటికీ ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించటం లేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియటంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో పనులను గురువారం పరిశీలించనున్నారు.

రంగంలోకి అమాత్యులు పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తిచేసి సాగునీరందించాలన్నది సర్కారు లక్ష్యం. ఏడేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు పనులు కొలిక్కి రాలేదు. ఆది నుంచే అడ్డంకులు, అవాంతరాలు ఎదురయ్యాయి. భూసేకరణ ప్రక్రియకే దాదాపు రెండేళ్లు పట్టింది. తర్వాత కొవిడ్ మహమ్మారి విజృంభించటంతో పనులు ముందుకు సాగలేదు. తదనంతరం పనులు గాడినపడ్డట్టు అనిపించినా ఆశించిన పురోగతి కనిపించలేదు. 2023లో శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక ఈప్రాజెక్టుపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు సమీక్షలు జరిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేయటంతో పనులు మళ్లీ గాడినపడ్డాయి. రాష్ట్రంలో సార్వత్రిక సమరం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగియటంతో పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తామని సీఎం, మంత్రులు ప్రకటించారు. ఇందులో భాగంగా సీతారామ ప్రాజెక్టు పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించనున్నారు. అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఓచోట రిజర్వాయర్ నిర్మించాలని సర్కారు యోచిస్తోంది. 10- 13 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరింది. మంత్రుల తాజా పర్యటనలో రిజర్వాయర్ నిర్మాణంపైనా కీలక నిర్ణయం వెలువడే అవకాశముంది.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం ఖమ్మం జిల్లాలో 4 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరిగింది. ప్రాజెక్టులో మొత్తం నాలుగు చోట్ల పంప్ హౌస్‌లు నిర్మించారు. ఈ ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విభజించారు. భద్రాద్రి జిల్లాలోని 1- 8 ప్యాకేజీల్లో 114 కి.మీ. పొడవు ప్రధాన కాల్వ నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. సత్తుపల్లి ట్రంకు పనులను 9-12 ప్యాకేజీలుగా విభజించారు. కాల్వ పొడవు 116 కి.మీ. ఉంటుంది. యాతాకులకుంట టన్నెల్, గండుగులపల్లి వద్ద నాలుగో పంప్‌హౌస్ పనులు సాగుతున్నాయి. పాలేరు ట్రంక్ పనులను 13- 16 ప్యాకేజీల కింద చేపట్టారు. 79 కి.మీ. పొడవు కాల్వలు నిర్మించాల్సి ఉంది.

# కడెం ప్రాజెక్టు పనులు సత్వరమే పూర్తి చేయాలి :జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ఖానాపూర్ జులై 2(ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుకు జరుగుతున్న మరమ్మత్తు పనులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు.జరుగుతున్న ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తులు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కడెం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె సందర్శించి, ప్రస్తుత ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్ ఫ్లో, జరుగుతున్న గేట్ల మరమ్మతుల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తులు, ఇతర పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభం అయినా నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టు ఆపరేషన్ సిస్టం ను పర్యవేక్షించాలని చెప్పారు.ప్రతిరోజూ ప్రాజెక్టు నీటి మట్టం, ఇన్ ఫ్లో పరిశీలించాలని, అత్యాధునిక ప్రమాద హెచ్చరికల వ్యవస్థ ఉన్నందున నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు సమాచారాన్ని సమీప గ్రామాల ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. చేపట్టిన పనులు, నిర్వహణ తదితర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎస్ ఈ రవీందర్, ఈఈ విఠల్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి: ఐటిడిఎ పీవో కుష్బు గుప్తా









**మంచిర్యాల జులై 2(ప్రభాత సమాచారం)**
ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటిడిఎ పిఓ కుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు.మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల పిఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకటి, రెండు తరగతుల కోసం "రూం టూ రీడ్"

### డికోడబుల్ టెక్స్ట్ బుక్స్ ను ఆవిష్కరించిన కలెక్టర్







ఆదిలాబాద్ జులై 2(ప్రభాత సమాచారం):ఒకటి, రెండు తరగతుల కోసం "రూం టూ రీడ్ ఇండియా ట్రస్ట్" రూపొందించిన డికోడబుల్ టెక్స్ట్ బుక్స్ ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. రూం టూ రీడ్ ఇండియా రాష్ట్ర మేనేజర్ నరసింహా చారి గత సంవత్సరంలో రూం టూ రీడ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో చేయబోయే కార్యక్రమాల నివేదికను అందజేశారు. వచ్చే నెలలో రూం టూ రీడ్ సంస్థ రూపొందించిన మాడల్ లైబ్రరీల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నేర్చుకున్న అక్షరాలు, గుణింతాలు, ఒత్తులతో పదాలు, వాక్యాలు ఎలా తయారు చేయవచ్చో డికోడబుల్ టెక్స్ట్ (విసంకేత పాఠ్య పుస్తకాలు) ద్వారా ఒకటి, రెండు తరగతుల పిల్లలు సులభంగా నేర్చుకుంటారని అందుకు "రూం టూ రీడ్ ఇండియా ట్రస్ట్" రూపొందించిన డికోడబుల్ టెక్స్ట్ వికాసం1, 2లు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డికోడబుల్ టెక్స్ట్ వికాసం1, 2లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రూం టూ రీడ్ ఇండియా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. రాష్ట్ర మేనేజర్ నరసింహా చారి మాట్లాడుతూ ప్రత్యేకంగా తమ సంస్థ తయారు చేసిన డికోడబుల్ టెక్స్ట్ ను ఉపయోగించడం వల్ల పిల్లలలో పఠన నైపుణ్యాలు పెరిగడమే కాకుండా ధారాళం చదవుతారు. చదివినది అర్థం చేసుకోగలుగుతారు. వారు స్వతంత్ర పాఠకులుగా ఎదిగే అవకాశం ఉన్నది. వీటిని త్వరలోనే అన్ని స్థానిక సంస్థల ప్రభుత్వ పాఠశాలలోని ఒకటి, రెండు తరగతి పిల్లలకు అందజేస్తామని తెలిపారు. వచ్చే నెలలో పద్దెనిమిది మండలాలలోని పద్దెనిమిది ప్రాథమిక పాఠశాలలో రూం టూ రీడ్ సంస్థ రూపోందిస్తున్న మాడల్ లైబ్రరీల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా గత సంవత్సరం రూం టూ రీడ్ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను, ఈ విద్యా సంవత్సరం చేపట్టబోయే కార్యక్రమాల నివేదికను కలెక్టర్ కు అందజేశారు. పిల్లలలో పఠన నైపుణ్యాల కోసం ఎంతో తోడ్పాటును అందిస్తున్న రూం టూ రీడ్ సంస్థ చేపట్టబోయే కార్యక్రమాలకు తమ పూర్తి సహాకారం ఉ ంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎమ్.ఒ శ్రీకాంత్ గౌడ్, రూం టు రీడ్ రాష్ట్ర ప్రతినిధి ఎస్. ప్రవీణ్, ప్రాజెక్టు అధికారి టి. నితిన్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, వేణుగోపాల్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఎ.ఎమ్.ఒ శ్రీకాంత్ గౌడ్, రూం టు రీడ్ రాష్ట్ర ప్రతినిధి ఎస్. ప్రవీణ్, ప్రాజెక్టు అధికారి టి. నితిన్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకై సమిష్టిగా కృషి చేద్దాం - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

### గంజాయి పండించే వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవు - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

### కళాశాల,పాఠశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలి








**ఆదిలాబాద్ జులై 2(ప్రభాత సమాచారం)**
జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు . మంగళవారం కలెక్టర్ కార్యాలయం లోని తన ఛాంబర్లో ఎక్సైజ్, విద్యాశాఖ, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, రెవెన్యూ, అగ్రికల్చరల్, పోలీస్, వివిధ శాఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ, పండించడం, రవాణా పై తీసుకోవలసిన నిర్ణయాలపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల నందు ఆంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులలో మత్తు పదార్థాలపై, వాటి వల్ల కలుగు అనర్థాలపై అవగాహనను కల్పించాలని, ప్రతి ఆంటీ డ్రగ్ కమిటీల నందు పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకై ప్రత్యేకంగా ర్యాలీలు, వ్యాసరచన పోటీలు, డాన్స్ పోటీలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల హాస్టల్లో నందు ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తూ తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 35 కేసులను 111 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు 67 మందిపై కేసులు నమోదు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు. అదేవిధంగా ఇప్పటివరకు 42 మంది గంజాయి విక్రయదారులపై బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు తెలియజేశారు. గంజాయి వినియోగదారులకు కౌన్సిలింగ్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యా సంస్థల నందు, మత్తు పదార్థాలపై ఎటువంటి సమాచారం ఉన్న పోలీసు అధికారులకు సూచించాలని తెలిపారు. గ్రామాలను గంజాయి విక్రయదారుల ఆశలో పడి రైతులు గంజాయిని పండించినట్లయితే ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధి చేకూరదని, కేసులలో కూడా నమోదు చేయబడతాయని తెలియజేశారు. ముఖ్యంగా మహారాష్ట్రతో సరిహద్దుతో ఉన్నందున రైలు, రోడ్డు మార్గాలలో గంజాయి విక్రయదారులు ప్రయాణిస్తున్నట్లు, చిన్న మొత్తంలో ఆదిలాబాద్ పట్టణంలోకి గంజాయిని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు, వాటిని అడ్డుకు కునేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తూ అడ్డుకుంటుందని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి రైతులకు చైతన్య పరిచయం జరుగుతుందని తెలిపారు. అత్యధికంగా గంజాయి వినియోగిస్తున్న వారికి డి అడిక్షన్ సెంటర్లకు సిఫారసు చేసి వైద్యం అందించాలన్నారు. సమాజంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి కార్యక్రమాలపై, వారి దినసరి చర్య పై పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో 124 కేజీల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాల్చడం జరిగిందని తెలిపారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆర్డీఓ వినోద్ కుమార్, స్త్రీ శిశు, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు సబిత, సునీత కుమారి, డిఇఒ ప్రణిత, డిఐఈఓ రవీందర్, ఎక్సైజ్ సూరింటెండంట్ హిమశ్రీ, వ్యవసాయ అధికారి రమేష్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం మూడు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి సారించాలి
### సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి
### ఎస్టి, ఎస్టీ,బిసి, మైనార్టీ హాస్టల్ల లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ చెపాలి
### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ జులై 2(ప్రభాత సమాచారం)**
కలెక్టరేట్ నుండి గూగుల్ మీట్ ద్వార ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో వర్షాకాలం లో వచ్చే సీజనల్ వ్యాధులు, భారీ వర్షాలకు వరదలు రాకుండా ముందస్తు చర్యలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి తగు చర్యల నిమిత్తం ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూ ఎస్, పంచాయతీ,పోలీస్ శాఖ అధికారులు, తదితర శాఖల అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ గౌస్ ఆలం తో కలిసి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఏ ఏ ప్రాంతాలలో జరిగిన సంఘటనలకు తావివ్వకుండా ముందస్తు ప్రణాలికలు సిద్దం చేసుకొని ఎక్కడెక్కడ డ్యామేజ్ అయినా రోడ్లు, ఇళ్లు, గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని, హాస్టల్స్ పరిశుభ్రత పాటించడం, 312 హాబిటేషన్ లో వర్షాకాలం ఇబ్బందులు ఎదురవుతున్న వాటిని గుర్తించి అంగన్వాడీ కేంద్రాలలో ముందుగానే మూడు నెలలకు సరిపడ సరుకులు, పౌష్టికాహారం, తదితర సరఫరా చేసుకోవాలని అన్నారు.అదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొత్తం 457 చెరువులు ఉన్నాయని తెలిపారు.డెంజర్ జోన్ లకు వెళ్ళకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ఫోల్స్ రెడీగా ఉన్నాయనీ అన్నారు.వరదలు, విద్యుత్ ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, భారీ వర్షాల సమయంలో సురక్షితంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, రహదారుల పై ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి విపత్తుల నివారణ కు సమన్వయం తో పని చేయాలని తెలిపారు.




# మీకు వచ్చింది 99/100 కాదు.. 99/543: కాంగ్రెస్‌పై మోదీ సెటైర్లు

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలంతా పరిపక్వతతో తీర్పునిచ్చారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వరుసగా మూడోసారి తాము అధికారంలోకి రావడంతో కొందరు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని కాంగ్రెస్‌కు పరోక్షంగా చురకలంటించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చ సందర్భంగా ప్రధాని మోదీ మంగళవారం లోక్‌సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా విపక్షాలపై విరుచుకుపడ్డారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాల కు మళ్లీ ఘోర ఓటమి తప్పలేదని.. వారి బాధను అర్థం చేసుకోగలనని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "కాంగ్రెస్ ప్రతిపక్షంలోనే కూర్చోవాలని ప్రజలు మరోసారి తీర్పునిచ్చారు. వరుసగా మూడు సార్లు ఆ పార్టీ 100 మార్క్ దాటలేదు. ఇన్నిసార్లు ఓడినా వారిలో ఎలాంటి మార్పు రాలేదు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో ప్రతిపక్ష నేతలకు అర్థం కావట్లేదు. 99 సీట్లు వచ్చాయని కాంగ్రెస్ నేతలు మిఠాయిలు పంచుకుంటున్నారు. కాంగ్రెస్‌కు వందకు 99 సీట్లు రాలేదు. 543లో 99 వచ్చాయి. వారి స్ట్రైక్ రేట్ 26శాతం మాత్రమే. ప్రజా తీర్పును వారు ఇకనైనా గౌరవించాలి" మోదీ దుయ్యబట్టారు. "వికసిత్ భారత్ లక్ష్యంగా రాష్ట్రపతి మార్గదర్శనం చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై పలువురు సభ్యులు అభిప్రాయాలు చెప్పారు. సభ గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే. పదేళ్లలో అవినీతిరహిత పాలన అందించాం. అది చూసే ప్రజలు మరోసారి మాకు అవకాశమిచ్చారు. గత పదేళ్లలో ప్రపంచ దేశాల్లో దేశ ప్రతిష్ఠ మరింత పెరిగింది. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోంది. భారత్ ప్రథమ్ అనే మా విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. ఏ కార్యక్రమం చేపట్టినా భారత్ ప్రథమ్ కేంద్రంగానే తీసుకుంటున్నాం. మా పథకాలన్నీ అట్టడుగు వర్గాలకు చేరాలనేదే మా విధానం" అని ప్రధాని తెలిపారు.

# టీజీఆర్టీసీలో 3,035 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్



హైదరాబాద్: తెలంగాణలో నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ గుడ్ న్యూస్ చెప్పింది. ఆర్టీసీలో త్వరలో ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించింది. మొత్తం 3,035 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వీటిలో 2000 డ్రైవర్ ఉద్యోగాలు, 743 శ్రామిక్ ఉద్యోగాలు ఉన్నాయి. ఉద్యోగాల భర్తీకి అనుమతి రావడంపై మంత్రి పొన్న ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. కొత్త రక్తంతో ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

**పోస్టుల వివరాలు..** డ్రైవర్లు: 2000, శ్రామిక్: 743, డిపో మేనేజర్లు/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు - 25, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ - 15, డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) - 84, డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్) - 114, అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్) - 23, సెక్షన్ ఇంజినీర్ (సివిల్): 11, అకౌంట్స్ ఆఫీసర్ - 6, మెడికల్ ఆఫీసర్స్ (జనరల్) - 7, మెడికల్ ఆఫీసర్స్ (స్పెషలిస్ట్) - 7.

# ఇరురాష్ట్రాల సీఎంల భేటీపై కోదండరాం ఏమన్నారంటే?



హైదరాబాద్, జూలై 2: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చిచేందుకు ఈనెల 6న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అవనున్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీపై ప్రొఫెసర్ కోదండరాం స్పందించారు. విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల సీఎంలు చర్చించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పదేండ్ల సమస్యలపై ఇరు రాష్ట్రాల ప్రజలు ఇప్పటికీ ఏడుస్తున్నారని.. సమస్య ముగుస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రెండు రాష్ట్రాల ప్రజల తరపున చర్చ చేయడం మంచి పరిణామమని ప్రొఫెసర్ వెల్లడించారు. చంద్రబాబు ఏపీ ప్రజల ప్రతినిధిగా, రేవంత్ తెలంగాణ ప్రజల ప్రతినిధిగా సమస్యలపై చర్చిస్తారన్నారు. ముఖ్యమంత్రులు కలిసి మాట్లాడుకొని సమస్య పరిష్కరించుకోవడం తప్ప వేరే మార్గమే లేదన్నారు. పబ్లిక్ రంగ సంస్థల ఆస్తుల పంపకం, నదీజలాలు, ఉద్యోగుల విభజన అంశాలపై ఒక పరిష్కారం దొరుకుతుందన్నారు. కలిసి మాట్లాడుకుంటే పదేండ్ల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గతంలో సీఎంలుగా ఉన్న కేసీఆర్, జగన్ కలిసి భోజనం చేశారు తప్ప ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో చర్చించలేదని కోదండరాం విమర్శలు గుప్పించారు.

# రైతు ఆత్మహత్యపై మంత్రి తుమ్మల ఆగ్రహం.. తక్షణమే విచారణ చేయాలంటూ ఆదేశం..



ఖమ్మం: చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బొజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య ఘటనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. రైతు ఆత్మహత్యపై తక్షణమే విచారణ జరిపి నివేదిక అందజేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. పొద్దుటూరు గ్రామంలో ఇటీవల తన పొలం కొందరు వ్యక్తులు నాశనం చేశారంటూ బాధిత రైతు ప్రభాకర్ అధికారుల చుట్టూ తిరిగాడు. న్యాయం చేయాలంటూ నిందితులపై పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎవరూ పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన రైతు తన బాధ మొత్తాన్ని సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన పొలాన్ని ఏ విధంగా నాశనం చేశారు, అలాగే అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం చేయకపోవడం వంటి అంశాలను సెల్ఫీ వీడియోలో వివరించి అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు ప్రభాకర్ ఆత్మహత్య విషయం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి వచ్చింది. రైతు సెల్ఫీ వీడియో చూసిన మంత్రి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి తుమ్మల.. రైతు ఆత్మహత్యపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. విచారణ జరిపి తక్షణమే నివేదిక అందజేయాలని రెవెన్యూ, పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు పొలం పంచాయితీల కోసం ఆత్మహత్యలకు పాల్పడవద్దని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో పొలం పంచాయితీలపై ప్రత్యేక దృష్టి పెడతామని, ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు న్యాయం జరుగుతుందని, క్షణికావేశం, తొందరపాటుతో ఏ రైతు కూడా ప్రాణాలు తీసుకోవద్దని కోరారు.

# ఈడీ ఎదుట హాజరైన ఎమ్మెల్యే మహిపాల్

హైదరాబాద్, జూలై 2: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మంగళవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. మైనింగ్ తవ్వకాల్లో అక్రమాలు పాల్పడ్డారంటూ ఎమ్మెల్యేపై ఈడీ కేసు నమోదు చేసింది. అలాగే మైపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు మహిపాల్ ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. దాదాపు రూ.300 కోట్ల రూపాయల వరకు ప్రభుత్వానికి నష్టం వాటిల్లే విధంగా చేశారని ఆరోపించారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో పాటు సోదరుడి ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించింది. మైనింగ్ తవ్వకాల్లో ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించకుండా ఎగ్గొట్టారని ఆరోపణలు వచ్చాయి. సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్ పేరుతో మహిపాల్ రెడ్డి వ్యాపారం నిర్వహిస్తున్నారు. దాదాపు రూ.39 కోట్ల రూపాయల వరకు టాక్స్ ఎగ్గొట్టారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్‌లో వచ్చిన లాభాలన్నీ రియల్ ఎస్టేట్‌తో పాటు బినామీ పేర్లతో వ్యాపారాలు కొనసాగించినట్లు తెలుస్తోంది. సంగారెడ్డి పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో మహిపాల్ సోదరులు మైనింగ్ నిర్వహించినట్లు సమాచారం.

# రాహుల్ ప్రసంగంపై వివాదం.. ఆ వ్యాఖ్యలు తొలగింపు..

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో సోమవారం చేసిన ప్రసంగం తీవ్ర దుమారానికి కారణమైంది. కేంద్రప్రభుత్వంపై రాహుల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వివిధ మతాలకు సంబంధించిన అంశాలను ఆయన సభలో ప్రస్తావించారు. ముఖ్యంగా ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ.. కేంద్రప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ప్రసంగంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మరోవైపు రాహుల్ వ్యాఖ్యలను దేశవ్యాప్తంగా బీజేపీ నేతలు ఖండించారు. హిందువులను అవమానించేలా రాహుల్ మాట్లాడారని ఆరోపించారు. తక్షణమే రాహుల్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే రాహుల్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను బీజేపీ సభ్యులు కోరారు. దీంతో రాహుల్‌పై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా చర్యలు తీసుకున్నారు.

**ఆ వ్యాఖ్యలు తొలగింపు..** రాహుల్ గాంధీ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ పేర్కొంది. లోక్‌సభ స్పీకర్ ఆదేశాలతోనే రాహుల్ ప్రసంగంలో కొన్ని కామెంట్లు తొలగించామన్నారు. హిందూమతాన్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యయతో పాటు బీజేపీ, ఆర్ఎస్ఎస్, మోదీ, అగ్నివీర్, నీట్ పరీక్షల్లో అక్రమాలపై రాహుల్ చేసిన కొన్ని వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు లోక్‌సభ సచివాలయం తెలిపింది. జై సంవిధాన్ అంటూ చర్చను ప్రారంభించిన రాహుల్ గాంధీ గంట 40 నిమిషాల పాటు లోక్‌సభలో ప్రసంగించారు. ప్రతిపక్ష నేత ప్రసంగంపై పదేపదే పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్ధాని మోదీ కూడా రెండు సార్లు జోక్యం చేసుకుని రాహుల్ వ్యాఖ్యలను ఖండించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194



# తెలుగు రాష్ట్రాల సీఎంల కీలక భేటీకి ఏర్పాట్లు


హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఈనెల 6న హైదరాబాద్‌లో జరగనుంది. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య కీలక భేటీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. విభజన సమస్యలు పరిష్కరించుకునేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు నాయుడు రాసిన లేఖకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో చర్చించాల్సిన అజెండాను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈనెల 6న జరిగే సమావేశానికి ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించినట్టు సమాచారం. సహచర మంత్రులు, ఉన్నతాధికారులతోనూ ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నారు.

**రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలివే..** పునర్విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్ లో ఉన్న ఆర్టీసీ, రాష్ట్ర ఆర్థిక సంఘం తదితర 23 కార్పొరేషన్ల ఆస్తులపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పదో షెడ్యూల్‌లోని తెలుగు అకాడమీ, అంబేడ్కర్, తెలుగు యూనివర్సిటీ వంటి 30 సంస్థల ఆస్తులు, సేవలపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాజ్ భవన్, హైకోర్టు, లోకాయుక్త, కార్మిక సంక్షేమ నిధి, వాణిజ్య పన్నులు, విద్యుత్ సంస్థల బకాయిలపైనా వివాదాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోంశాఖ పలు సమావేశాలు నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ముఖ్యమైన చిక్కులను ముఖాముఖి చర్చలతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపడంతో.. రెండు రాష్ట్రాల మధ్య ఏళ్లు తరబడి పెండింగులో ఉన్న విభజన సమస్యలు కొలిక్కి రావొచ్చని ఇరు రాష్ట్రాలు ఆశిస్తున్నాయి. మరో వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంత వాసుల్లో చర్చనీయాంశంగా ఉన్న ఖమ్మం జిల్లా భద్రాచలం విలీన గ్రామపంచాయతీలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. ఏపీలో విలీనమైన ఏటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలని కోరారు.




హైదరాబాద్: తెలుగు సినీ పరిశ్రమ సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడిపై అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దీనికి సంబంధించిన వీడియోలను థియేటర్‌లలో కచ్చితంగా ప్రదర్శించాలన్నారు. అలా ప్రదర్శించిన థియేటర్లకే భవిష్యత్తులో అనుమతులు జారీ చేస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టీజీ న్యాబ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో వాహనాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం రోజు ప్రముఖ సినీనటుడు చిరంజీవి ముందుకొచ్చి ఓ వీడియోను రికార్డు చేసి పంపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. "సినిమా ఇండస్ట్రీలో ఉండే ప్రముఖులకు నా సూచన. కొత్త సినిమా విడుదలైనప్పుడు టికెట్ రేట్లు పెంచుకోవడానికి జీవోల కోసం ప్రభుత్వాల దగ్గరకు వస్తున్నారు కానీ, సామాజిక సమస్యలైన సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణలో మీ వంతు బాధ్యత వహించడం లేదని మా ప్రభుత్వం భావిస్తోంది. నేను మా అధికారులకు ఒక సూచన చేస్తున్నా. ఇక నుంచి ఎవరైనా కొత్త సినిమా విడుదలవుతున్న సందర్భంగా టికెట్ ధరలు పెంచమంటూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే, వాళ్లు డ్రగ్స్, సైబర్ క్రైమ్ నియంత్రణకు కృషి చేస్తూ ఒక వీడియో చేయాలి. మీరు విడుదల చేస్తున్న సినిమాలోని స్టార్స్‌తో ఆ వీడియో రూపొందించాలి. ఇది కచ్చితమైన షరతు. ఇండస్ట్రీలో ఎంత పెద్ద వాళ్లు వచ్చి రిక్వెస్ట్ చేసినా సరే, ఆ మూవీ తారగణంతో ఒకట్రెండు నిమిషాల నిడివి గల వీడియో విజువల్స్ తీసుకొచ్చి ఇస్తేనే వాళ్లకు వెసులుబాటు, రాయితీలు ఇవ్వండి. ఎందుకంటే సమాజం నుంచి వాళు ఎంతో తీసుకుంటున్నారు. సమాజానికి వాళ్లు కొంతైనా ఇవ్వాలి. అది వాళ్ల బాధ్యత. సినిమా కోసం వందల కోట్లు పెట్టుబడి పెట్టి, టికెట్లు రేట్లు పెంచుకుని సంపాదించుకుంటామన్న ఆలోచన మంచిదే. అది వ్యాపారం. కానీ, సామాజిక బాధ్యత కూడా అవసరం. డ్రగ్స్, సైబర్ క్రైమ్‌ను నియంత్రించకపోతే సమాజం నిర్వీర్యమవుతుంది. ఈ సమాజాన్ని కాపాడటానికి సహకరించాల్సిన బాధ్యత సినీ పరిశ్రమపై ఉంది. ప్రభుత్వ నుంచి సహకారం కోరే వారు సమాజానికి సహకరించాలి. ఇదొక్కటే మా కండీషన్. సినిమా షూటింగ్‌ల అనుమతి కోసం వచ్చినప్పుడే ఈ సూచన చేయాల్సిందిగా పోలీస్‌శాఖను కోరుతున్నా. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం రోజు ప్రముఖ సినీనటుడు చిరంజీవి ముందుకొచ్చి ఓ వీడియోను రికార్డు చేసి పంపించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా" "60 ఏళ్ల పోరాటం, వందలాది విద్యార్థుల త్యాగంతో తెలంగాణ ఏర్పాటైంది. సమాజంలో వచ్చిన మార్పు, బలహీనతలను ఆసరాగా చేసుకుని కొంతమంది అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని నేరాలకు పాల్పడుతున్నారు. నేరాల కట్టడికి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాం. వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. సిబ్బందితో పాటు నిధులు కేటాయిస్తున్నాం. సైబర్ నేరాలు అతిపెద్ద సమస్యగా మారాయి. వీటి నియంత్రణకు సైబర్ క్రైమ్ పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారు. బాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి ఇస్తున్నారు. ఇందుకు వారిని అభినందిస్తున్నాను" "గత ప్రభుత్వాలు చేసిన నిర్లక్ష్యం వల్ల నేడు కళాశాలలు, స్కూళ్లలోనూ గంజాయి దొరుకుతోంది. వీటిపై చర్యలు తీసుకునేందుకు సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నాం. కేవలం సంపన్నులే కాకుండా మధ్యతరగతి, పేద యువకులు కూడా గంజాయికి బానిసలుగా మారుతున్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ అరికట్టడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి పదోన్నతులు కల్పిస్తాం. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి దీనికి సంబంధించిన విధివిధానాలు సిద్ధం చేస్తాం. మీడియా కూడా రాజకీయ వ్యవహారాలే కాకుండా డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడికి కృషి చేయాలని కోరుతున్నాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# చంద్రబాబు అత్యంత శక్తివంతుడు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన చేతిలోనే..



హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర విభజన సమస్యలపై చర్చించడానికి లేఖ రాయడం సంతోషకర పరిణామమని ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టును ఏపీలో కలిపారన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఏడు మండలాలను ఏపీకి అప్పగించారన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి చొరవ చూపాలని చంద్రబాబు అన్నారు. ఏడు మండలాలను తిరిగి తెలంగాణకు రప్పించడానికి ప్రయత్నం చేయాలన్నారు. దీన్నే మొదటి ఎజెండాగా పెట్టాలన్నారు. ఏడు మండలాలు ఇచ్చిన తర్వాతనే మిగిలిన అంశాలపై ముందుకు వెళ్లాలని హరీష్ రావు అన్నారు. చంద్రబాబు అత్యంత శక్తి వంతుడని.. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఆయన చేతిలోనే ఉన్నాయని హరీష్ రావు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం రెండు నెలల పెన్షన్ బకాయి పడిందన్నారు. పక్క రాష్ట్రంలో చంద్రబాబు పెన్షన్ పెంచితే.. మన సీఎం మాత్రం రెండు నెలలు బకాయి పడ్డారన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ప్రభాకర్ అనే ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారని.. ఆయన ఆత్మహత్య చాలా హృదయ విదారకంగా ఉందన్నారు. రాష్ట్రంలో పరిస్థితికి ప్రభాకర్ ఆత్మహత్య నిదర్శనమన్నారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కూడా పోలీసులు పట్టించుకోవడం లేదని హరీష్ రావు అన్నారు. ఎమ్మార్వో, కలెక్టర్, ఎస్ఐ ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఏ ఒక్కరు పట్టించుకున్నా ప్రభాకర్ ప్రాణాలు దక్కేవన్నారు. బాద్యుల పై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని.. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని హరీష్ రావు అన్నారు.

# సబితారెడ్డి కాంగ్రెస్‌లోకి రావద్దంటూ నిరసన..

హైదరాబాద్: తన స్వార్ధం కోసం తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని వదిలి సీఎల్పీని టీఆర్ఎస్?లో విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే సబితారెడ్డి అధికార దాహంతో తిరిగి కాంగ్రెస్?లోకి రావడానికి ప్రయత్నించడం సహించరానిదని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సబితారెడ్డి కాంగ్రెస్?లోకి వస్తున్నారన్న సమాచారంతో ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల పార్టీ ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తాలో సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 2018 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై గెలిచిన 12మంది ఎమ్మెల్యేలు పార్టీ పిరాయించడానికి ముఖ్య పాత్ర పోషించిన సబితారెడ్డి తన రాజకీయ స్వార్థం, అధికార దాహంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌లో ఉండి ఎంతో అభివృద్ధి చెందిన ఆమె కష్టకాలంలో ఉన్న పార్టీని కాపాడుకోవాల్సింది పోయి, తల్లిలాంటి పార్టీని వదిలిపెట్టి టీఆర్ఎసలోకి వెళ్లడం క్షమించరానిదన్నారు. తన అధికార దర్పంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను నానా ఇబ్బందులకు గురిచేసి అడుగడుగునా అణచివేతకు గురిచేసి, కేసులు పెట్టించి జైలుకు పంపిన చరిత్ర మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తిరిగి పార్టీలోకి రావడానికి నానా రకాలుగా ప్రయత్నాలు చేస్తురన్నారు. ఇలాంటి స్వార్థ రాజకీయ నాయకులను తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, శంకర్‌యాదవ్, ధనరాజ్‌గౌడ్, రమేష్ నేత, జ్ఞానేశ్వర్‌యాదవ్, పెద్దవూర సైదులు, దుబ్బాక శేఖర్ పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660